# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని పేర్కొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

**3.** **ఓల్టేజ్ సమస్యలు తగ్గించేందుకు పెద్ద సంఖ్యలో ఉప విద్యుత్ కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామన్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్.**

**4.** **రాష్ట్రాభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి.**

**5.** **వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండ రామ స్వామి వారి కల్యాణోత్సవంలో ఈ సాయంకాలం పాల్గొననున్న ముఖ్యమంత్రి.**

==========================

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సవరణ చట్టం పేరుతో బిల్లు ప్రవేశపెట్టిన హోంశాఖ … వెంటనే లోక్ సభాపతి ఓం బిర్లా అనుమతితో చర్చ ప్రారంభమైంది. అమరావతి బిల్లుపై చర్చలో కాంగ్రెస్ తరపున మాణిక్యం ఠాకూర్ పాల్గొనగా, రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, అమరావతి నిర్మాణం కోసం ఎంతోమంది భూములు ఇచ్చారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరులో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పంట

ఉత్పత్తుల స్టాళ్ళను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

సంస్కరణలతో రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ఆక్వా రంగాలకు రాయితీతో విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద సంఖ్యలో ఉప విద్యుత్ కేంద్రాల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ ఉత్పత్తి పెంచామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమానికి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులోని గొడుగు వారి గూడెం గ్రామంలో లబ్ధిదారులకు పింఛన్ నగదును మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఉచిత విద్యుత్ పథకం కింద చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నామని తెలిపారు.

వాయిస్..30.. సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వ "టీబీ ముక్త్ భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా ఆయన ఈ రోజు స్పందిస్తూ, క్షయవ్యాధినివారణలో ప్రతి అడుగు ముఖ్యమైనదేనని అన్నారు. సంపూర్ణ చికిత్స విధానాలను పాటించడం, రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండటం వంటి జాగ్రత్తలు రోగితో సమాజాన్ని రక్షించే బాధ్యతలని పేర్కొన్నారు. "టీబీ ముక్త్ భారత్ అభియాన్' రెండవ దశ అమలు 100 రోజులు కొనసాగుతుందని తెలిపారు. ముందస్తు గుర్తింపు, క్రమబద్ధమైన చికిత్స, విస్తృత అవగాహనతో క్షయ రహిత భారతదేశాన్ని సాధించవచ్చని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో ఇంధన భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాయితీపై విద్యుత్ ఆధారిత ఇండక్షన్ స్టవ్‌లను లబ్ధిదారులకు మంత్రి నిన్న పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇండక్షన్ స్టవ్‌ల ద్వారా గ్యాస్ అవసరం లేకుండా వంట చేసుకోవచ్చని తెలిపారు. దీనివల్ల గ్యాస్ ఆదా కావడంతో పాటు ప్రజలకు ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. 4 వేల 700 రూపాయల ఇండక్షన్ స్టవ్‌ను, రాయితీతో 2 వేల 400 రూపాయలకు అందజేస్తున్నామ ని మంత్రి వివరించారు. అనంతరం పెనుకొండ పరిధిలోని పంచాయతీలకు వ్యర్థాలను సేకరించే స్వచ్ఛ రథాలనూ మంత్రి ప్రారంభించారు.

---------------------------

రాష్ట్రాభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ, రాజధాని అనేది రాష్ట్రాల పరిధిలోని అంశమని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అమలులో ప్రభుత్వం విఫలమైందని ప్రజల దృషి మళ్లించేందుకే అమరావతిపై శాసనసభలో తీర్మానం చేశారని విమర్శించారు. అమరావతి మౌలిక వసతుల కల్పనకే కోట్లాది రూపాయలు ఖర్చు అవుతాయని జగన్మోహన్ రెడ్డి పేర్కొంటూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

వైయస్సార్ కడప జిల్లా ఒంటిమిట్టలో శ్రీ కోదండ రామ స్వామి వారి కల్యాణోత్సవం ఈరోజు జరగనుంది. సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుంచి రాత్రి 8 గంటల 30 నిమిషాల వరకు జరిగే కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు హాజరై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేశాయి. కల్యాణోత్సవాని వచ్చే భక్తులు కోసం ప్రధాన కల్యాణ వేదికకు ఎదురుగా 120 గ్యాలరీలు ఏర్పాటుచేశారు. 2 వేల 500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్ వైపు నుంచి తిరుపతికి వెళ్లే వాహనాలను కడప నుంచి రాయచోటి మీదుగా, తిరుపతి నుంచి హైదరాబాదు వెళ్లే వాహనాలను పీలేరు, రాయచోటి, కడప మీదుగా మళ్లించినట్లు ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ తెలిపారు.

---------------------------

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టులపై చర్చించనున్నారు. 430 కోట్ల రూపాయల విలువైన కేంద్ర పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రమంత్రికి వివరించనున్నారు. అలాగే రాష్ట్రానికి మరో 9 కొత్త పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలు, స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్, శాస్కి పథకాల కింద పర్యాటక కేంద్రాల అభివృద్ధి, ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్‌ల బలోపేతంపై నివేదికలను కేంద్రమంత్రికి దుర్గేష్ అందజేయనున్నారు.

======================